# రాబందుల రెక్కల చప్పుడు

యం. రత్నమాల

"నువ్వొట్టి చాతకాని వాడివి.

పెళ్లాన్ని కనీసం పోషించలేని అసమర్థుడివి.

కనీసం యింత విషం యిచ్చి అయినా చంపెయ్యటం చాతకాని మగాడివి. మొగుడివి. ఛీ"

ఈ మాటలేవీ జానకి పైకి అనలేదు.

బొత్తిగా రెండురోజుల నుంచీ ఏమీ లేక పేగులు చుట్టుకుపోతూంటే, ఆ రోజు కూడా మొండిచేతులతో వచ్చిన మొగుడ్ని అలా అనాలని మాత్రం అనుకుంది.

అలా అనినా అది ఆమె తప్పేం కాదు.

ఎందుకంటే, సుమారు

సంవత్సరం నుండి దరిద్రంతో కటకటలాడటం ఆమెకు అలవాటయింది.

రమణ ఒకప్పుడు బాగా బ్రతికి చితికిపోయిన వాడేమీ కాదు. అతని బ్రతుకెప్పుడూ చిల్లుల విస్తరే!

ఎలాగో జానకితో ముడిపడింది.

జానకి, మొగుడి మంచితనం, ముఖ్యంగా అతని మెత్తని కళ్లు చూసి మొదట్లో మహ ముచ్చట పడిపోయింది.

అపర శ్రీరామచంద్రుడే అనుకుంది. అప్పట్లో రమణ కళ్ళు గుళ్ళోదేవుడి మెరుగుపెట్టని వెండికళ్ళలా, కాంతిహీనంగా వెలుగుతుండేవి.

అవి, ధూప, దీప, నైవేద్యాలు సక్రమంగా సాగుతున్న డబ్బున్న గొప్పదేవుడి బంగారు కళ్ళలా ఎన్నడూ మెరవలేదు.

అందుకు జానకి ఆశపడలేదు కూడా.

పైగా, అవి అతనిలోని పవిత్రత తాలుకు చిహ్నాలనుకుని మురిసిపోయింది.

కానీ,

ఇప్పుడవి, ఎవరో దొంగాడు కక్కుర్తిపడి వెండికళ్ళు పీకేస్తే, మిగిలిపోయిన రాతిలో గోతుల్లా వున్నాయి. అతను రిక్తహస్తాలతో ఒక్కక్షణం మొండిగా, మరీ మొండి జగన్నాదుడిలా కనబడ్డాడు.

లోపలకి వెళ్లి గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది. అతను నీరసంగా మంచంమీద వాలాడు.

మొదలు నరికిన వృక్షంలా కాకుండా, గాలికి వాలిపోయిన సర్వే మొక్కలా.

కనీసం కాఫీకూడా లేదు!

నోట్లో నీళ్ళూరాయి.

కాఫీ కప్పులో,

నీళ్లుపోసి, కాళ్ళు చాపుకుని, నెమ్మదిగా వూదుకుంటూ తాగినంతలో—